క్లుప్తంగా

పవన్ కల్యాణ్‌ది పెత్తందారీ మనస్తత్వం


అయినపర్తి రాహుల్

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే సదుద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టారని దీనిపై పవన్ కల్యాణ్ పేదల విద్యను చులకనగా మాట్లాడడంపై తీవ్రంగా ఖండిస్తున్నామని నియోజకవర్గ వైఎస్సార్ పార్టీ విద్యార్థి విభాగం సెక్రటరీ అయినపర్తి రాహుల్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడిన రాహుల్ పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం అవసరం లేదని ప్రభుత్వ పాఠశాలల విద్యా విధానంపై నిర్లక్ష్యంగా మాట్లాడుతున్న పవన్ వ్యాఖ్యలు పెత్తందారీ మనస్తత్వంలా ఉన్నాయన్నారు. పేదలకు ఇంగ్లిష్ మీడియం వద్దంటున్న పవన్ తన పిల్లలను ఏ మీడియం చదివించారని ప్రశ్నించారు. మీకో న్యాయం..పేద ప్రజలకో న్యాయమా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తయారవుతుంటే ఎందుకు అంత అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. పవన్ తన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కొడమంచిలిలోని చినపేటకు చెందిన గుండె చంద్రశేఖర్ (33) ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఈయనకు భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కారణం ఏమిటో తెలియదు గానీ ఈనెల 21న సాయంత్రం పొలంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గ్రామం సమీపంలోని హాస్పిటల్‌కు తరలించగా మెరుగైన వైద్యం కోసం ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆసుపత్రి వైద్యులు మెడికో లీగల్ కేసుగా నమోదు చేసి అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

ఎంపీటీసీ సభ్యురాలు అనురాధకు సత్కారం


మార్టేరులో అనురాధ, జోగిరెడ్డి దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

పెనుమంట్ర: మార్టేరులోని శివరావుపేటలోని చర్చిరోడ్డును అభివృద్ధి చేసినందుకు ఎంపీటీసీ సభ్యురాలు కర్రి అనురాధ, జోగిరెడ్డి దంపతులను ఆదివారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ రోడ్డు ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉండటంతో స్థానిక శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి, ఎంపీటీసీ-1 సభ్యులు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి మండల పరిషత్ నిధులతో ఈ రోడ్డును సిమెంట్‌రోడ్డుగా అభివృద్ధి చేసి, సమస్యను పరిష్కరించినందుకుగాను వైఎస్సార్‌సీపీ సమన్వయకమిటి ఆధ్వర్యంలో గ్రామస్తులు అనురాధను సత్కరించారు.

మహో కనకదుర్గ.. విజయ కనకదుర్గ

- వైభవంగా దసరా ఉత్సవాలు
- మహిళల కుంకుమ పూజలతో ఆలయాలు కళకళ
- పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివస్తున్న భక్తులు


నరసాపురం: స్టీమర్‌రోడ్డులో అమ్మవారికి పూజలు చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు


నరసాపురం: మహిషాసురమర్దని అలంకరణలో పుంతలోముసలమ్మ


పెనుమంట్ర: వెలగలవారిపాలెంలో దుర్గాదేవి అలంకరణ


పెనుగొండ: వాసవీ శాంతి థాంలో దుర్గాదేవిగా వాసవీ మాత


పెనుగొండ: దుర్గాదేవిగా మహిషాసురమర్దని


పెనుమంట్ర: మల్లిపూడిలో ఆకట్టుకున్న గ్రామోత్సవం

నరసాపురం: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో పట్టణంలోని వివిధ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల్లో ఆదివారం దుర్గాష్టమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. పండ్ల మార్కెట్ వద్ద 39వ దేవీ శరన్నవరాత్రి వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారు శ్రీమహాగౌరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటి సభ్యులు మండెల సత్యనారాయణ, గునిశెట్టి సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాయిపేట పుంతలోముసలమ్మ ఆలయం వద్ద, గోల్డ్ మార్కెట్ వద్ద స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్న మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతబజార్ వలవల వారి వీధిలో భద్రాద్రి రామసాయి మందిర్‌లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. వలవల సురేష్ దంపతుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. కొండాలమ్మ, నాగారమ్మ, గడ్డిబజార్‌లోని దుర్గాదేవి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దసరా ప్రజలకు సుఖసంతోషాలు అందించాలి

దసరా ప్రజలకు సుఖసంతోషాలు అందించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కోరుకున్నారు. దుర్గాష్టమి పర్వదినం పురస్కరించుకుని ఆదివారం ముదునూరి పట్టణంలోని పలు అమ్మవార్ల ఆలయాలు దర్శించుకున్నారు. అలాగే స్టీమర్‌రోడ్డు, పంజాసెంటర్ వద్ద నిర్వహిస్తున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల మండపాలను సందర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: శరన్నవ రాత్రులు సందర్భంగా ఆచంట, పెనుగొండ మండలాల్లో అమ్మవార్లు దుర్గా దేవిగా పూజలు అందుకొన్నారు. పెనుగొండ శ్రీనగరేశ్వర మహిసాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత, మహిషాసురమర్దనీ మాతలు దుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో మరకత శిల వాసవీ మాత దుర్గాదేవి అలంకరణలో పూజలు నిర్వహించారు.

వేడుకగా 102 కన్యల పూజ

శరన్నవ రాత్రులు సందర్భంగా పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసురమర్దని వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో ఆదివారం 102 కన్యల పూజలు వేడుకగా నిర్వహించారు. వాసవీమాత, మహిషాసురమర్దనీ మాతలు దుర్గాదేవి అలంకరణలో దర్శనం ఇవ్వగా, ప్రధాన అర్చకులు కోట వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శ్రీనగరేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకంలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మశ్రీ రామడుగుల నర్సింహమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు కోట వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 102 కన్యల పూజ నిర్వహించగా, సుమారు 650 మంది చిన్నారులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భారీ అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట్ల మోహనరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సువాసిని పూజ

ములపర్రు శివారు పితాని వారి పాలెంలో దుర్గమ్మ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాష్టమి పురస్కరించుకుని సువాసిని పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మనమంచి మురళీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేండ్ర త్రిమూర్తులు, వేండ్ర ఆంజనేయులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు సందర్భంగా ఆదివారం పార్వతిదేవిని దుర్గాదేవిగా అలంకరించారు. అలాగే బంగారు వారి శ్రీ వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అమ్మవారిని మహాకాళి దేవిగా అలంకరించారు. కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవార్లకు లక్ష కుంకుమార్చనలు, సహస్రనామార్చనలు, అష్టోత్తర పూజలు చేశారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి వివిధ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెగ్గిపూడి గ్రామంలో వనుములమ్మ, శ్రీకనక దుర్గమ్మ అమ్మవార్లను ఎర్రగులాబీలు, మందారాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లిపూడి గ్రామంలో దుర్గాదేవిని పూలరథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డియూత్ యువకులు వివిధ దేవతామూర్తుల వేషధారణలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

చెత్త రీసైక్లింగ్ యూనిట్ పనుల పరిశీలన


డంపింగ్‌యార్డులో చెత్త రీ సైక్లింగ్ పనులు పరిశీలిస్తున్న గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని ఎన్నో ఏళ్ల నుంచి తీరని సమస్యగా ఉన్న డంపింగ్‌యార్డు పూర్తిగా తొలగింపునకు సంబంధించి చర్యలు చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) తెలిపారు. ఆదివారం ఆయన యడ్ల బజార్ డంపింగ్‌యార్డును పరిశీలించారు. అవినాష్ ఏజెన్సీ ద్వారా చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పట్టణంలో 25,181 టన్నుల చెత్తను రీసైక్లింగ్ చేయడానికి అవినాష్ ఏజెన్సీకి టెండర్లు అప్పగించినట్లు వివరించారు. చెత్త రీ సైక్లింగ్‌లో భాగంగా ప్లాస్టిక్ కవర్లు, ఐరన్, గాజు ముక్కలు, లెదర్, ఇసుక, మట్టి వేరు చేస్తుందన్నారు. ఇలా విడిపోయిన చెత్తను బయట ఫ్యాక్టరీలకు తరలిస్తారన్నారు. రోజుకి 250 నుంచి 300 టన్నుల చెత్త రీ సైక్లింగ్ జరుగుతుందన్నారు. యడ్లబజార్ డంపిం గ్‌యార్డు మొత్తం ఖాళీ చేసిన అనంతరం ఇక్కడ మొక్కలు పెంచి సుందరీకరణ చేసి పార్కుగా అభివృద్ధి చేస్తామన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో పట్టణ నడిబొడ్డులో నివాసాల మధ్య యడ్లబజారులో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి చెత్తంతా ఇక్కడ డంప్ చేయడంతో పట్టణ ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. కొండలా పేరుకుపోయిన చెత్త నుంచి వెలువడుతున్న పొగ వలన, దుర్వాసన వలన ప్రజలు అనేక అనారోగ్య సమస్యలను చవిచూశారన్నారు. డంపింగ్ యార్డులోని చెత్త రీ సైక్లింగ్ చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చెత్త రీసైక్లింగ్ యూనిట్‌ను పాలకొల్లులో ఏర్పాటు చేసినట్లు గుడాల గోపి తెలిపారు. ఆయన వెంట దెందులూరు నియోజకవర్గ పరిశీలకుడు యడ్ల తాతాజీ, వార్డు ఇన్‌చార్జ్ రుంకాని దుర్గారావు, మాజీ కౌన్సిలర్ దొమ్మేటి వెంకట్రావు, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాసరావు, జోగి వెంకటేశ్వరరావు, నంబూరు శ్రీగంగా పవన్‌కుమార్, చెన్ను విజయ్, సన్నిశెట్టి లీలాభవన్నారాయణ, ఉండ్రాజవరపు రవికుమార్, శంకరాపు శ్రీను, కొండేటి రవి, జోగి వడ్డికాసులు, గవర బుజ్జి, పెచ్చెట్టి కృష్ణాజీ, ఉనికెల శ్రీనివాసరావు, కొరగింజల శ్రీనివాసరావు, కొర్రగింజల హనుమంతరావు, తలుపూరి భుజంగరావు, పాలపర్తి కృపనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొండేపూడి శివారు పంట పొలాల మధ్య పేకాట ఆడుతున్న 8 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు ఆదివారం చెప్పారు. వీరి నుంచి నుంచి రూ.3,800 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.
- పాలకోడేరు

బీసీ కులాలన్నీ ఐక్యంగా పని చేయాలి


బీసీ కులాల ఐక్యవేదిక సమావేశంలో చేతులు కలిపి సంఘీభావం తెలుపుతున్న బీసీ కులాల నాయకులు

యలమంచిలి: బీసీలలో వర్గాలుగా విభజించబడిన కులాలన్నీ రాజకీయంగా ఎదగాడానికి ఐక్యం కావాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. స్థానిక బీసీ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన బీసీ కులాల ఐక్యవేదిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజకీయంగా, సాంఘికంగా, వాణిజ్యపరంగా పైకెదగాలంటే కులాలను పక్కకు పెట్టి మనమంతా బీసీలమని ఐక్యంగా ఉండాలని ఆయన కోరారు. బీసీలకు రాజకీయంగా ఎలాంటి సహాయం కావాలన్నా చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు. ఏ అవసరం ఉన్న తనతో చెపితే సాధ్యమైనంత త్వరగా అవసరం తీరుస్తానని గోపి చెప్పారు. బీసీల్లో అత్యధికంగా ఉన్న శెట్టిబలిజ, గౌడ కులాలు ఒకడుగు తగ్గి మిగిలిన కులాలకు ప్రాతినిథ్యం కల్పించాలని గోపి కోరారు. అనంతరం అన్ని కులాల నాయకులు చేతులు కలిపి సంఘీభావం తెలిపారు. సమావేశంలో కన్వీనర్ గుబ్బల వేణు, ఆప్కో మాజీ డైరెక్టర్ తమ్మా అనంత నాగభూషణం, గౌడ, శెట్టిబలిజ, అగ్నికుల క్షత్రియులు, రజకులు, న్యాయీ బ్రాహ్మణులు, పద్మ శాలీలు, బుడ్గ జంగాలు, విశ్వ బ్రాహ్మణుల నాయకులు దొంగ విజయ్‌కుమార్, అనిశెట్టి నవీన్, అనిశెట్టి మల్లిక, పొన్నమండ ముత్యాలరావు, మల్లుల బుజ్జి, కుక్కల రామకృష్ణ, చించినాడ జయశ్రీను, కొల్లు మాధవరావు, పొన్నమండ నాగరాజు, వాడపల్లి అప్పన్న, వాడపల్లి వీరబాబు, చెల్లింకుల శ్రీనివాస్, దేవరకొండ వీరాంజనేయులు, మేడిపల్లి గోపి, అల్లవరపు వెంకట సత్యనారాయణ, తలుపూరి భాస్కరరావు, గాడి దుర్గాప్రసాద్, చెన్నూరి నాగుల తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో ఉచిత ధ్యానశిక్షణ

పెనుమంట్ర: ప్రతి ఒక్కరూ ధ్యానంతో పాటు స్వాధ్యాయం సజ్జన్ సాంగత్యం అభ్యాసం చేయాలని విజయవాడకు చెందిన పిరమిడ్ మాస్టర్ ఎం.శివశంకర్‌రావు అన్నారు. పెనుమంట్ర గ్రామంలోని భూపతిరాజు శ్రీనివాసరాజు నివాసంలో ఏర్పాటు చేసిన పిరమిడ్ కేంద్రంలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ధ్యానంపై అవగాహన కల్పించారు. కేవీడీ ప్రసాద్, నాగరాజు, మధు, సతీష్, ప్రసాద్, సాయిగీత, లక్ష్మీ పాల్గొన్నారు.